క్లుప్తంగా

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం జరిగింది. పరిగి మండలం పి.నరసాపురంలో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రజలందరికీ మంచి జరగాలన్నదే ముఖ్యమంత్రి జగనన్న ఆశయమన్నారు. అర్హులకు పారదర్శకంగా సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. జగనన్న సురక్షను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే అమరాపురం, గుడిబండ, పెనుకొండ, లేపాక్షి, అగళి, చిలమత్తూరు, గోరంట్ల, రొళ్లలో అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. – సాక్షినెట్‌వర్క్‌:

మత్తుతో భవిష్యత్తు చిత్తు

హిందూపురం టౌన్‌: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అదనపు జిల్లా జడ్జి శైలజ సూచించారు. శనివారం స్థానిక ఎస్‌డీజీఎస్‌ కళాశాలలో మత్తు పదార్థాల వినియోగం, ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీజే మాట్లాడుతూ.. మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ ప్రతినిధులు చంద్రమోహన్, బైసాని రాంప్రసాద్, ప్రిన్సిపాళ్లు నాగేంద్ర కుమార్, ప్రసాద్, న్యాయవాదులు సుదర్శన్, సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.

మట్కాబీటర్ అరెస్ట్



సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకొన్న మట్కా పట్టీలు, సెల్‌ఫోన్లు, నగదు

హిందూపురం అర్బన్‌: ఓ మట్కాబీటర్‌ను హిందూపురం సెబ్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు.. హిందూపురం పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తరువాత అనుమానాస్పదంగా తిరుగుతున్న బోయపేటకు చెందిన సికిందర్‌ను సెబ్ సీఐ స్వర్ణలత ఆధ్వర్యంలోని సిబ్బంది పట్టుకున్నారు. అతని వద్ద నుంచి మట్కా పట్టీలు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.1,22,840 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. హిందూపురం నుంచి తూమకుంట చెక్‌పోస్టు వైపు సికిందర్ వెళ్తున్నట్లు గుర్తించారు. అరెస్ట్ చేసి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. తనిఖీల్లో తుమకుంట సెబ్ ఎస్‌ఐ ఓం సింహ, సిబ్బంది ఉన్నారు.

వలంటీర్లకు వందనం

కోవిడ్‌లో అన్నీ తానై..



గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తున్న వలంటీర్ మంజునాథ్ (ఫైల్)

ఈ ఫోటో కనిపిస్తున్న వ్యక్తి పేరు మంజునాథ్. పట్టణంలోని అరేపేటలో వలంటీర్‌గా పని చేశాడు. 2020 మే నెలలో మడకశిరలో కరోనా పాజిటివ్ కేసులు అధికంగా రావడంతో కంటైన్మెంట్ జోన్‌గా ప్రకటించారు. బంధువులు కూడా ఇంటికి రాని సమయంలో వలంటీర్ మంజునాథ్ సేవలందించేందుకు ధైర్యంగా ముందుకొచ్చాడు. అరేపేటలో ఇంటి వద్దకే గ్యాస్ సిలెండర్లను అందజేసి, స్థానికులతో శభాష్ అనిపించుకున్నాడు. నిత్యావసరాలు లేక ఇబ్బంది పడుతున్న వారికి సైతం కూరగాయలు, సరుకులు అందజేశాడు. – మడకశిరరూరల్‌:

ఫీవర్ సర్వే చేసి.. ప్రాణాలు రక్షించి



ఇంటింటికీ తిరుగుతూ ఫీవర్ సర్వే చేస్తున్న వలంటీర్ నవీన్‌కుమార్ (ఫైల్)

ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు నవీన్ కుమార్. మడకశిర మండలం దిన్నెమీద పాళ్యం గ్రామంలో వలంటీర్‌గా పని చేస్తున్నాడు. కరోనా సమయంలో తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజల ఇంటి వద్దకే సేవలు అందిచాడు. కరోనా నియంత్రణలో భాగంగా ధైర్యంగా ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టాడు. ప్రజలు కరోనా బారిన పడకుండా జాగ్రత్తలు తెలియజేశాడు. కరోనా బాధితుల ఇళ్ల వద్దకే వెళ్లి నిత్యావసరాలు అందజేసి, మానవత్వం చాటుకున్నాడు. దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలతో బాధపడుతన్న వారికి దగ్గరుండి కోవిడ్ టెస్టులు చేయించాడు. – మడకశిరరూరల్‌:

తోబుట్టువులా సేవ చేశాడు



మడకశిరలో అరేపేటను అధికారులు కంటైన్మెంట్ జోన్‌గా ప్రకటించడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. వార్డు వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకున్నారు. సరుకులు, గ్యాస్, పాలు అందజేశారు. ఆ సమయంలో వలంటీర్లు సేవలు అందించకపోయింటే తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. వలంటీర్లు అందించిన సేవలతో సంతృప్తి చెందాం. కరోనా సమయంలో తమకు వలంటీర్లు సేవలు బాగా ఉపయోగపడ్డాయి. – సునీరా అరేపేట, మడకశిర

వలంటీర్ల సేవలు మరువలేం



నా భర్త వీఆర్‌ఓ నాగరాజుకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో మడకశిరలోని క్వారంటైన్ సెంటర్‌కు వెళ్లారు. ఆ సమయంలో విషయ తెలుసుకున్న వలంటీర్లు నాగేంద్ర రెడ్డి, నవీన్‌కుమార్ బంధువుల్లా వచ్చి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిత్యావసరాలు, కూరగాయలు అందజేశారు. ఆ సమయంలో వలంటీర్లు ఎంతో ధైర్యంగా అందించిన సేవలు మరవలేం. – అరుణ, దిన్నెమీదపాళ్యం, మడకశిర మండలం

పేదల ద్రోహి చంద్రబాబు నాయుడు

- టీడీపీ మేనిఫెస్టోను నమ్మొద్దు
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలు డాక్టర్ తిప్పేస్వామి, శంకరనారాయణ

మడకశిరరూరల్‌: సంక్షేమ పథకాలను ప్రజలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని చందకచెర్లు సచివాలయ పరిధిలోని భీమరాయనపల్లి, కొత్తలం గ్రామాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిన బుక్‌లెట్లను అందజేశారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండానే ప్రభుత్వ పథకాలు తమ ఇంటి వద్దకే అందుతున్నాయని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. పేదల ద్రోహి చంద్రబాబు అని, టీడీపీ మేనిఫెస్టోను నమ్మొద్దన్నారు. కొత్తలంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, సర్పంచ్ ప్రభావతిబాయి, ఎంపీపీ కవిత, సింగల్‌విండో అధ్యక్షుడు రామిరెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు బీఎల్ రామకృష్ణ, నాగరాజు గౌడు, వైస్ ఎంపీపీలు శ్రీరామరెడ్డి, మూర్తి, మాజీ ఎంపీపీ బజ్జప్ప, సొసైటీ డైరెక్టర్ నరసింహప్ప,స్వామి పాల్గొన్నారు.



భీమరాయనపల్లిలో మహిళకు పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



పరిగి: మహిళను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

వైఎస్సార్‌సీపీలో చేరిక

మడకశిరరూరల్‌: మండల పరిధిలోని హరేసముద్రం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త రమేష్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరంతా శనివారం భీమరాయనపల్లిలో ఎమ్మెల్యే తిప్పేస్వామి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వైస్ ఎంపీపీ మూర్తి, ఎస్సీ సెల్ నాయకుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకూ న్యాయం

పరిగి: నాలుగేళ్లుగా ప్రభుత్వం అనేక విధాలుగా మేలు చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పాలనలో సంతోషంగా ఉన్నామని పి. నరసాపురం పంచాయతీ ప్రజలు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణకు తెలిపారు. పీ నరసాపురం పంచాయతీలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పలు చోట్ల రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతి, ఎంపీపీ సవిత, నాయకులు రామచంద్ర, అరుణ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి,మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, జెడ్పీటీసీ శ్రీరామప్ప, మాజీ మండల కన్వీనర్ జయరామ్, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను విమర్శించడం దుర్మార్గం



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం: వలంటీర్లను విమర్శించడం దుర్మార్గమని ఎంపీపీ ఈరన్న, వైస్.ఎంపీపీ క్రిష్ణమూర్తి పేర్కొన్నారు. శనివారం ఎంపీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేనాని పవన్ కళ్యాణ్ కావాలనే వలంటీర్లను విమర్శిస్తున్నారన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా వలంటీర్లు వారికి కేటాయించిన 50 కుటుంబాల వద్దకు వెళ్లి వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకాలను వివరిస్తున్నారని తెలిపారు. ప్రజలను సచివాలయం వద్దకు తీసుకెళ్లి అధికారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. వలంటీర్లను ఇష్టం వచ్చినట్లు తిడితే ఊరుకోమని హెచ్చరించారు. వలంటీర్లు అందిస్తున్న సేవలు మీ కళ్లకు కనబడవా అని ప్రశ్నించారు. దేశంలోనే వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు వలంటీర్ వ్యవస్థ బాగుందని పొగడుతుంటే, బాబు అతడి దత్తపుత్రుడు మాత్రం వలంటీర్లపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు పిఆర్.మూర్తి, శివకుమార్ పాల్గొన్నారు.

మల్బరీ సాగుతో ఆదాయం



సూచనలిస్తున్న పట్టుపరిశ్రమ శాఖ శాస్త్రవేత్త లక్ష్మి

గోరంట్ల: ఆధునిక పద్ధతుల్లో మల్బరీ సాగు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చని పట్టు పరిశ్రమ శాఖ శాస్త్రవేత్త లక్ష్మి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని వడిగేపల్లిలో ఆధునిక పద్ధతుల్లో పట్టు పురుగుల పెంపకంపై 'పట్టు బడి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త లక్ష్మి మాట్లాడారు. పట్టు పురుగుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర రెడ్డి, వైస్ ఎంపీపీ నాగభూషణ రెడ్డి, సర్పంచ్ మూర్తి పాల్గొన్నారు.

మసీదుల అభివృద్ధికి కృషి

హిందూపురం టౌన్‌: మసీదుల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డ్ కార్యదర్శి ఇమ్రాన్ బాషా తెలిపారు. శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులను జిల్లా వక్ఫ్ బోర్డ్ కార్యదర్శి ఇమ్రాన్ బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ ఇర్ఫాన్, కౌన్సిలర్లు షాజియా, ఆసిఫ్, శివ, రామచంద్ర, హ్యూమన్‌రైట్స్ డివిజనల్ చైర్మన్ నందకుమార్, నాయకులు రామ్మూర్తి, డాక్టర్ బాషా, సీపీసీ సాధిక్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంఈఓ గంగప్ప, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శనివారం పార్టీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డిని కలిశారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంత రెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



ఎమ్మెల్యే వెంకటేశ్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్ సుజాత

పావగడ: స్థానిక తాలూకా కార్యాలయ మీటింగ్ హాల్‌లో శనివారం ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ సమితి సమావేశం జరిగింది. వైఎన్ హొసకోటలో కలుషిత తాగునీరు తాగి పలువురు అస్వస్థతకు గురికావడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీ తాగునీటి సరఫరా ప్రధాన ఇంజినీర్ హనుమంతరాయప్పపై మండిపడ్డారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే దెబ్బతిన్న పైప్‌లైన్ మార్చాలన్నారు. కొత్త పైపులైన్ వేయాలని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ శాఖ ముఖ్యాధికారి షంషు, ఉద్యానవన శాఖ, పశు వైద్య శాఖ, వ్యవసాయ శాఖ, ఆరోగ్య, గ్రామీణ తాగు నీటి శాఖ, విద్యుత్ శాఖ అధికారులు అభివృద్ధి పనులను వివరించారు. తుమకూరు రోడ్డులో ఉన్న మల్బరీ శాఖ కార్యాలయంలో జరిగిన మల్బరీ సాగు రైతుల శిక్షణ, విచార సంకీర్ణ శిబిరంలో పాల్గొన్నారు. మల్బరీ రైతుల సమస్యలను తెలుసుకున్నారు. మల్బరి రైతులు ఇబ్బందులు పడకుండా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అంతకుముందు వైఎన్ హొసకోటలోని రాష్ట్రీయ విద్యా పీఠ సంస్థలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలో ఏ వన్ డిజిటల్ షాప్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, గ్రేడ్ 2 అధికారి మూర్తి తదితర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మెరుగైన సేవలందించాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

రొద్దం: ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో వ్యాధి నిరోధక టీకాల పంపిణీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా పనిచేయాలని ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీలో బదిలీపై వెళ్లిన ఇద్దరు ఉద్యోగులను సన్మానించారు. పెద్దమంతూరు, లక్ష్మానిపల్లి గ్రామాలను సందర్శించి.. ప్రజలతో ఆరోగ్యం, విద్యపై ఆరాతీశారు. కార్యక్రమంలో డాక్టర్లు జగదీశ్‌బాబు, సోమశేఖర్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

రొద్దం: సమయపాలన పాటించకుండా, విధి నిర్వహణలో ఎవరైనా అంగన్‌వాడీ వర్కర్లు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిలక్ష్మి హెచ్చరించారు. శనివారం మండలంలోని ఆర్.లోచెర్ల, పెద్దకోడిపల్లి, బూచెర్ల, అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేశారు. ప్రీస్కూల్స్ విద్య పిల్లలకు అందించాలన్నారు. సెంటర్‌లో శుభ్రత పాటించాలన్నారు. పలు రికార్డులు, పౌష్టికాహారం పంపిణీపై ఆరాతీశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనురాధ పాల్గొన్నారు.

కలుషిత నీరు తాగి 14 మందికి అస్వస్థత

పావగడ: వైఎన్ హొసకోట గ్రామంలో శనివారం కలుషిత నీరు తాగడంతో 14 మంది అస్వస్థతకు గురయ్యారు. బెస్తరపల్లి రోడ్డులో ఉన్న తాతయ్య గుడి దగ్గర తాగునీటి పైప్‌లైన్‌లోకి మురుగు నీరు చేరడంతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యారు. ఇద్దరు బాధితులకు వాంతులు కావడంతో పావగడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారు వైఎన్ హొసకోట పీహెచ్‌సీలో చికిత్స పొంది ఇళ్లకు వెళ్లారని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. ఎవరికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న మాక్ అసెంబ్లీ

పావగడ: తాలూకాలోని అరసికెర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సాక్షరతా క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. 8, 9, 10వ తరగతులకు చెందిన 20 మంది విద్యార్థులు 14 స్థానాలకు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. విధాన సభ, లోకసభకు జరిగే సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే మొబైల్ ద్వారా పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల అధికారిగా హెచ్‌ఎం గోవిందప్ప, పీఆర్వోగా రేణుకారాజ్, పరిశీలకులుగా హనుమేశ్, కుమార్, రవి, రశ్మి, విమల మోహన్ కుమార్, అభిషేక్ విధులు నిర్వహించారు.

గ్రంథాలయ పన్ను వసూలు చేయాలి

హిందూపురం టౌన్‌: పట్టణంలో గ్రంథాలయ పన్ను వసూలుకు కృషి చేయాలని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ స్థానిక గ్రంథాలయాధికారిని సూచించారు. శనివారం స్థానిక శాఖా గ్రంథాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయం పనితీరు, అందుబాటులో ఉన్న పుస్తకాలు, సౌకర్యాలను పాఠకులతో అడిగి తెలుసుకున్నారు. పాఠకులకు అవసరమున్న రీడర్ ఆన్ డిమాండ్ రిజిస్టర్‌ను నమోదు చేయాలని, వాటిని సాధ్యమైనంత వరకూ త్వరలో తెప్పిస్తామన్నారు. గ్రంథాలయాధికారి శ్రీధర్ , గుణప్రియ, పాల్గొన్నారు.

పరిగి: పరిగి, సేవామందిరం గ్రంథాలయాలను శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తనిఖీ చేశారు. గ్రంథాలయంలో పుస్తకాల వివరాలు, పాఠకుల సందర్శన రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయాధికారులు విజయకుమారి, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిత



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

రొద్దం: పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కోగిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. డీవైఈఓ రంగస్వామి, డీఎస్పీ హుసేన్‌పీరా హాజరయ్యారు. హెచ్‌ఎం నారాయణరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సబ్‌కలెక్టర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. విద్యార్థి దశ నుంచే సేవా గుణం అలవర్చుకోవాలన్నారు. డీవైఈఓ, డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంచారి, సర్పంచ్ రమాదేవి, ఎస్‌ఐ నాగస్వామి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి

పెనుకొండ: విద్యాభివృద్ధికి కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులకు డీవైఈఓ రంగస్వామి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలోని ఆడిటోరియంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడు పనులలో పురోగతి సాధించాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. విద్యార్థులకు ట్యాబ్‌ల వాడకంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనంపై నిరంతర తనిఖీలు చేపట్టాలని సూచించారు. దృశ్యశ్రవణ విద్యా బోధనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు నాగార్జునుడు, ఫణికుమార్, సుబ్బారావు, రామకృష్ణ, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1976–77 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులు రామాచారి, రామశాస్త్రి, రామమూర్తి, శ్యాంసుందర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విజయభాస్కర్ నాయుడు, షబ్బీర్, రవిశంకర్, గోవిందరాజులు, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

హిందూపురం అర్బన్‌: సబ్ జైలులో ఉంటున్న ఖైదీలకు నాణ్యమైన భోజనం అందించాలని హిందూపురం అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి సూచించారు. శనివారం సబ్ జైలును తనిఖీ చేశారు. ఖైదీలు ఉంటున్న గదులు, వారి కోసం తయారు చేసిన ఆహార పదార్థాలు, నిత్యావసర సరుకులను పరిశీలించారు. జైలు అధికారి అంజినాయక్, న్యాయవాది నరసింహమూర్తి, శారద పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

సోమందేపల్లి: మండలంలోని వెలుగు మాకులపల్లిలో శనివారం కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కిష్టప్ప అనే వ్యక్తి 10 టెట్రా ప్యాకెట్లు అమ్ముతుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పకడ్బందీగా ఓటు సర్వే

హిందూపురం టౌన్‌: నియోజకవర్గ వ్యాప్తంగా బీఎల్‌ఓల ద్వారా పకడ్బందీగా ఓటరు సర్వే చేపడతామని తహసీల్దార్ హసీనా సుల్తానా అన్నారు. శనివారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈనెల 21 నుంచి ఆగస్టు 20 వరకూ ఓటరు సర్వే జరుగుతుందన్నారు. చేర్పులు, మార్పులు, తొలగింపులు, తదితర వివరాలపై బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చామన్నారు.

అగళి ఎంఈఓ–1గా భాస్కర్ శ్రీనివాస్

అగళి: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం ఎంఈఓ–1గా భాస్కర్ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంఈఓను సత్కరించారు.